క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సాలూరు: నియోజకవర్గంలో సాలూరు పట్టణం, మండలం, పాచిపెంట, మక్కువ మండలాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనున్నట్టు ఏపీఈపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ కె.గోపాలరావునాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణం, మండలాల్లో విద్యుత్ సబ్‌స్టేషన్ల మరమ్మతు పనుల నేపథ్యంలో శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

రాజగోపాల్ మాస్టారుకు నివాళులు


వంతరాంలో రాజు మాస్టారు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే జోగారావు

బలిజిపేట: మండల ఉపాధ్యక్షురాలు బి.హేమలత భర్త బి.రాజగోపాల్ మాస్టారు బుధవారం మృతి చెందగా విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆయన కుటుంబ సభ్యులను గురువారం పరామర్శించారు. వంతరాంలో ఆయన మృతదేహం వద్ద నివాళులర్పించారు. ఆయన లేని లోటు తీర్చలేనిదన్నారు. ఉపాధ్యాయుడిగా అందరి మన్ననలు పొందిన రాజగోపాల్ మరణం విషాదాన్ని నింపిందన్నారు. కుటుంబానికి అండగా ఉంటానని భరోసానిచ్చారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు మురళీకృష్ణ, ఎంపీపీ నాగమణి, జెడ్పీటీసీ రవికుమార్, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

క్రీడాకారుడికి అభినందనలు


అజయ్‌ను అభినందిస్తున్న హెచ్‌ఎం తదితరులు

సీతానగరం: స్థానిక ఉన్నత పాఠశాలలో విద్యతో పాటు క్రీడల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థి నరం అజయ్‌ను హెచ్‌ఎం ప్రసన్నలక్ష్మితో పాటు ఉపాధ్యాయులు గురువారం అభినందించారు. పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న అజయ్ ఇటీవల చిత్తూరు జిల్లా అరగొండలో ఈ నెల 22 నుంచి 25 వరకు జరిగిన రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ క్రీడల్లో ద్వితీయ స్థానం సాధించాడు. పీడీ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, ఎస్ఎంసీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా ముడుపుల పూజలు


పూజలందుకుంటున్న లక్ష్మీనృసింహస్వామి

సీతానగరం: మండల కేంద్రంలోని సువర్ణముఖి నదీ తీరాన వేంచేసిన వేణుగోపాలస్వామి సముదాయంలోని లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో ముడుపుల పూజలు గురువారం ఘనంగా జరిగాయి. పూజల్లో పాల్గొన్న భక్తులచే ఆలయ అర్చకులు పి.శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో అభిషేకాలు, పూజలు నిర్వహించారు. వేకువజాము నుంచి మధ్యాహ్నం వరకు పూజలు జరిగాయి.

పంచగవ్య ద్రావణం తయారీపై అవగాహన


మిర్తివలసలో ద్రావణం తయారీపై అవగాహన కల్పిస్తున్న ఎంసీఆర్‌పీలు

బలిజిపేట: మిర్తివలసలో పంచగవ్య ద్రావణం తయారీపై రైతులకు ఐసీఆర్‌పీలు లక్ష్మి, తిరుపతిరావులు గురువారం అవగాహన కల్పించారు. రైతులు ఎస్.హేమలత, గోవిందలకు చెందిన మామిడి తోటల కోసం 700లీటర్ల ద్రావణం తయారీ చేశారు. దీని వినియోగంపై అవగాహన కల్పించారు. పండ్ల తోటలు, కాయగూర తోటల్లో వినియోగించడం వలన నాణ్యమైన, అధిక దిగుబడులు పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో రైతులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్ల నిర్వాహకులకు ప్రజారోగ్యం పట్టడం లేదు. నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా మినరల్ వాటర్ పేరిట జనరల్ వాటర్‌ను సరఫరా చేస్తున్నట్టు వీటి నిర్వాహకులపై ఆరోపణలు వినిపిస్తున్నాయి.

- పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న వాటర్ ప్లాంట్లు
- నాణ్యత ప్రమాణాలు పాటించని వైనం
- పట్టించుకోని అధికారులు

ప్రజారోగ్యంతో చెలగాటం


పట్టణంలో నిర్వహిస్తున్న వాటర్ ప్లాంట్

పార్వతీపురం టౌన్:

వాటర్ ప్లాంట్ల నిర్వాహకులు ప్రజారోగ్యంతో చెలగాటమాడుతున్నారు. మినరల్ వాటర్ పేరిట జనరల్ వాటర్ సరఫరా చేస్తూ ప్రజలను నిలువునా ముంచుతున్నారు. ఏమాత్రం నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా నీటిని విక్రయిస్తున్నారు. సీజనల్ వ్యాధుల ప్రబలుతున్న ప్రస్తుత తరుణంలో నాణ్యత లేని నీటితో ప్రజారోగ్యాన్ని ప్రమాదంలో పడేస్తున్నారు. నీటి దోపిడీని, నాణ్యతా ప్రమాణాలను పరిశీలించాల్సిన అధికారులు సైతం పట్టించుకోకపోవడంతో నిర్వాహకుల ఇష్టారాజ్యమైంది.

నాణ్యతా ప్రమాణాలు ఇలా..

- అధికారుల అనుమతి తీసుకున్నాకే వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలి.
- వాటర్ క్యాన్ మీద నీటిని శుద్ధి చేసిన తేదీ, బ్యాచ్ నంబరు తప్పనిసరిగా నమోదు చేయాలి. ప్రతి నెలా శానిటరీ అధికారులు పరీక్షించి ఆ నీటిని బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్స్‌కు పంపాలి.
- వాటర్ ప్లాంట్ ప్రారంభించాలంటే ఐఎస్ఐ నిబంధనలు తప్పక పాటించాలి.
- ప్లాంట్‌లో మూడు వేల లీటర్ల సామర్థ్యం కలిగిన ట్యాంకులు ఏర్పాటు చేయాలి.
- శుద్ధి చేసిన నీటిని నిల్వ చేసేందుకు 304 గ్రేడ్ స్టెయిన్లెస్ స్టీల్ ట్యాంకులు మాత్రమే ఉపయోగించాలి.
- నీటిలో పీహెచ్ శాతం ఎంత ఉందో పరీక్షించాలి. పీహెచ్ శాతం 75 శాతం తగ్గితే ఆ నీటిని తాగిన వారు కిడ్నీ సంబంధిత వ్యాధుల బారిన పడే అవకాశముందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

తనిఖీలకు ఆదేశాలిచ్చాం..

మున్సిపాలిటీలో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్లను సచివాలయ సిబ్బంది తరచూ తనిఖీలు చేసేలా ఆదేశాలు ఇచ్చాం. అందుబాటులో వున్న కార్యదర్శులు వాటర్ ప్లాంట్లను తనిఖీలు చేస్తున్నారు. ఎక్కడైనా ఫిర్యాదులు ఉన్నట్లయితే కార్యదర్శులకు సమాచారం ఇవ్వాలి.
– కె.వెంకట పకీర్ రాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్, పార్వతీపురం

పార్వతీపురం పట్టణం, మండలంలో 21 వరకు వాటర్ ప్లాంట్‌లు ఉన్నాయి. వీటి ద్వారా స్థానిక ప్రజలతో పాటు సుదూర ప్రాంతాలకు నీటిని సరఫరా చేస్తున్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించని నిర్వాహకులు

వాటర్ ప్లాంట్లలో చాలా వాటికి ఐఎస్ఐ గుర్తింపు లేదు. ప్రతి ప్లాంట్లో నీటిని నిల్వ చేసే ట్యాంక్ స్టెయిన్లెస్ స్టీల్ ఉండాలన్న ప్రధాన నిబంధన ఎక్కడా అమలు కావడం లేదు. దీంతో ప్రజలు ఆయా ప్లాంట్లలో అరకొర శుద్ధి చేసిన నీటిని కొనుగోలు చేసి అనారోగ్యానికి గురవుతున్నారు. ఆటోల్లో మినరల్ వాటర్ పేరుతో ఒక్కో క్యాన్‌ను రూ.20, నేరుగా వెళ్తే వారికి రూ.15 వరకు విక్రయిస్తున్నారు.

విద్యార్థుల హెల్త్ కార్డుల పరిశీలన


కార్డులను పరిశీలిస్తున్న ఎంఈఓ 1 సామల

బలిజిపేట: చిలకలపల్లి ఉన్నత పాఠశాలలో విద్యార్థుల హెల్త్ కార్డులను ఎంఈఓ 1 ఎస్.సింహాచలం గురువారం పరిశీలించారు. విద్యార్థులకు వైద్య శాఖ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించి కార్డులో నమోదు చేసినట్టు తెలిపారు. వాటి వివరాలు తెలుసుకుని విద్యార్థుల ఆరోగ్యానికి సంబంధించి ఎటువంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తారనేది వారిని అడిగి తెలుసుకున్నారు. ఇందులో భాగంగా పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల ప్రగతిపై ఉపాధ్యాయులతో సమీక్షించారు. తరగతి గదిలో విద్యార్థులను కలిసి పాఠ్యాంశాలకు సంబంధించి పలు ప్రశ్నలు వేసి వారి నుంచి సమాధానాలు రాబట్టారు. ఎంఎల్‌హెచ్‌పి ఆర్.త్రివేణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా సప్టా

సాలూరు రూరల్: కందులపదం పంచాయతీ మడతనవలస గ్రామం వద్ద సప్టా గోతు లు ఏర్పడి ప్రమాదకరంగా మారింది. నిత్యం ద్విచ క్ర వాహనాలతో రద్దీగా ఉండే కందులపదం రోడ్డు మడతనవలస వద్ద వర్షాకాలంలో నీరు ప్రవహించే సప్టా ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతింది. దీంతో ఇక్కడ వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు స్పందించి సప్టా వద్ద మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం


సమావేశంలో మాట్లాడుతున్న శిశు సంక్షేమ శాఖ జిల్లా కోఆర్డినేటర్ పి.రాజశేఖర్

పార్వతీపురం టౌన్: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని శిశు సంక్షేమ శాఖ జిల్లా కోఆర్డినేటర్ పి.రాజశేఖర్ అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఐసీడీఎస్ పీడీ ఎం.ఎస్.రాణి, డీపీఈఓ మంజులా వీణల ఆధ్వర్యంలో బాల్య వివాహాలపై అవగాహన సదస్సు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ బాల్య వివాహాలను ప్రభుత్వం ఎప్పుడో నిషేధిస్తు చట్టం చేసిందని పేర్కొన్నారు. కానీ గ్రామాల్లో ఉండే చాలా మందికి అవగాహన లేక తమ పిల్లలకు తెలిసీతెలియని వయసులో వివాహాలు జరిపిస్తున్నారని తెలిపారు. బాల్య వివాహాలను నిర్మూలించడానికి ప్రభుత్వం బాల్య వివాహాల నిషేధ చట్టం 2006ను రూపొందించిందని వివరించారు. చట్టాన్ని ఎవరైనా ఉల్లంఘిస్తే కఠినమైన శిక్షలు తప్పవన్నారు. ఎవరైతే బాల్యవివాహాన్ని ప్రోత్సహిస్తారో వారికి రెండు సంవత్సరాల జైలుశిక్ష లేదా లక్ష రూపాయల వరకు జరిమానా విధించే అవకాశం ఉందన్నారు. బాల్య వివాహాల నిషేధంపై బాల బాలికలతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మరమ్మతు పనులు చేపట్టాలి

పార్వతీపురం టౌన్: పట్టణంలోని గుంతలు పడ్డ రహదారులకు మరమ్మతులు చేయాలని సీపీఎం పట్టణ కార్యదర్శి జి.వెంకటరమణ డిమాండ్ చేశారు. పట్టణంలోని రహదారులపై పడిన గుంతల వద్ద గురువారం వారు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రహదారుల గుంతల వల్ల పాదచారులు సైతం ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. అధికారులు స్పందించాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ కమిటీ సభ్యులు పాకల సన్యాసిరావు, బంకురు సూరిబాబు, సంచాన ఉమా, పడాల రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మరో మహాత్ముడు జ్యోతిరావు పూలే


జ్యోతిరావు పూలేకు నివాళులర్పిస్తున్న మాజీ ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

సాలూరు: మహాత్మ జ్యోతిరావు పూలే మరో మహాత్ముడని మాజీ ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. పూలే వర్ధంతి సందర్భంగా పట్టణంలోని తన కార్యాలయంలో పూలే చిత్రపటం వద్ద గురువారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ బాలికా విద్యకు, బీసీల అభ్యున్నతికి, సామాజిక చైతన్యానికి జ్యోతిరావు పూలే విశేష కృషి చేశారన్నారు. పూలే ఆశయాలకు అనుగుణంగా నేటి కూటమి ప్రభుత్వం పాలన సాగించడం లేదని విమర్శించారు. పూలే ఆశయాల సాధన దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇకనైనా పాలన సాగించాలని కోరారు. కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు గిరి రఘు, రెడ్డి సురేష్, రామకృష్ణ, బాలాజీ, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



సైబర్ నేరాలపై తస్మాత్...

సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ సింహాచలం అన్నారు. పెదపెంకి రోడ్డులో సైబర్ నేరాలపై ప్రజలకు గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ నేరాలపై పూర్తి అవగాహన అవసరమన్నారు. సైబర్ మోసానికి గురయ్యే వారు తక్షణమే పోలీసులను సంప్రదించాలని సూచించారు. స్థానికులు పాల్గొన్నారు. – బలిజిపేట



ఇంటి పన్నుల వసూలుపై ప్రత్యేక దృష్టి

జిల్లాలో ఇంటి పన్నులు శతశాతం వసూలు చేసి గ్రామాభివృద్ధి పనుల నిర్వహణకు కార్యదర్శులకు ఆదేశించామని జిల్లా పంచాయతీ అధికారి కొండలరావు అన్నారు. మండలంలోని సూరంపేట పంచాయతీలో జరుగుతున్న పనులు, ఇళ్ల పన్నులు వసూలు, గృహాల ఎసెస్‌మెంట్ ఆన్‌లైన్ డేటాను, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్ల పన్నుల వసూలుపై పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. – సీతానగరం



మహనీయుడు జ్యోతిరావుపూలే...

జ్యోతిరావు పూలే అంటరానితనం, కుల వ్యవస్థల నిర్మూలన, మహిళోద్ధరణకు పాటు పడిన మహనీయుడు మహాత్మ జ్యోతిరావుపూలే అని మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. పూలే వర్ధంతి కార్యక్రమాన్ని బలిజిపేటలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గురువారం నిర్వహించారు. పూలే చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూలే సామాజిక సేవా దృక్పతం కలిగిన వ్యక్తి అని కొనియాడారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మురళీకృష్ణ, జెడ్పీటీసీ రవికుమార్, ఎంపీపీ నాగమణి, మాజీ జెడ్పీటీసీ పి.నారాయణరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. – బలిజిపేట

నాణ్యతతో గోకులాలు నిర్మించాలి


గోకులాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ త్రివిక్రమరావు

సీతానగరం: ఉపాధి హామీ నిధులతో నిర్మిస్తున్న గోకులాలను నాణ్యత ప్రమాణాలకు లోబడి నిర్మించాలని ఎంపీడీఓ పి.త్రివిక్రమరావు అన్నారు. మండలంలో నిర్మితమవుతున్న గోకులాలను ఆయన గురువారం పరిశీలించారు. మండలంలోని పాడి పశువులున్న రైతులకు ఉపాధి హామీ పథకం ద్వారా 24 గోకులాలు మంజూరు చేసినట్టు చెప్పారు. 18 గోకులాలు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయన్నారు. ఇప్పటికే బుడ్డిపేటలో, పెదబోగిలి గ్రామాల్లో గోకులాల నిర్మాణాలు పూర్తి కావచ్చాయన్నారు. ప్రతి పనిని ఇంజినీరింగ్ అధికారులు పరిశీలించి బిల్లులకు సిఫారసు చేయాలని సూచించారు. మిగతా గోకులాల నిర్మాణాలు పూర్తి చేయాలని, పూర్తి చేసిన వెంటనే బిల్లులు లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు సమ చేయనున్నట్టు తెలిపారు. ఆయన వెంట ఇంజినీరింగ్ సహాయకులు, లబ్ధిదారులు ఉన్నారు.

సాగునీటి సంఘాల ఎన్నికలపై అవగాహన


మాట్లాడుతున్న తహసీల్దార్ ఉమామహేశ్వరరావు

సీతానగరం: మండలంలో డిసెంబర్‌లో నిర్వహించనున్న సాగునీటి(ఆయకట్టు) సంఘాల ఎన్నికల నిర్వహణకు పీఓలు, ఏపీఓలు అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ ఉమామహేశ్వరరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఇరిగేషన్ ఇంజినీరింగ్ అధికారి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఎన్నికల నిర్వాహకులకు గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో త్వరలో సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించనున్నందున పోలింగ్ ప్రశాంతంగా, నిబంధనలకు లోబడి నిర్వహించేందుకు పోలింగ్ అధికారుల పాత్ర కీలకమన్నారు. ఎన్నికల నిర్వహణకు ముందుగా పీఓలు, ఏపీఓలకు అవగాహన సదస్సు దోహదపడుతుందన్నారు. రెండు ప్రాజెక్టులకు, మైనర్ ఇరిగేషన్ ఆయకట్టు సంఘాలకు ఎన్నికలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఒక్కో సంఘానికి ఆరుగురు సభ్యులు ఉంటారన్నారు. సదస్సులో ఎంఈఓలు జి.సూరిదేముడు, వెంకటరమణ, ఇంజినీరింగ్ అధికారులు, వీఆర్ఓలు పాల్గొన్నారు.

కార్మిక చట్టాలు అమలు చేయాల్సిందే...


మాట్లాడుతున్న నాయకులు

సాలూరు : ఏపీఎస్‌ఆర్‌టీసీలో పని చేస్తున్న కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ కార్మికులు, ఎయిర్‌బస్ డ్రైవర్లకు కార్మిక చట్టాలు అమలు చేయాల్సిందేనని ఏపీఎస్ ఆర్‌టీసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) రాష్ట్ర కార్యదర్శి తులసీరామ్ డిమాండ్ చేశారు. సాలూరు పట్టణంలో ఆర్టీసీ డిపో వద్ద గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కిల్డ్ వర్కర్లకు రూ.11,900, సెమి స్కిల్డ్ వర్కర్లకు రూ.14,058లు, డ్రైవర్లకు రూ.17,226లు ఈఎస్ఐ, పీఎఫ్, వారాంతపు సెలవులు, లేబర్ హాలిడేస్ తదితర హక్కులను కల్పించాలని డిమాండ్ చేశారు. డిసెంబర్ 4న అక్కయ్యపాలెంలో కార్మిక శాఖ కార్యాలయం వద్ద జగరనున్న సమావేశానికి అన్ని డిపోల నుంచి కార్మికులు పెద్ద ఎత్తున తరలి రావాలని, డిమాండ్ సాధనకు అందరం ఐక్యంగా పోరాడేందుకు సిద్ధపడాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు చంద్రయ్య, ఎన్వై నాయుడు, శంకర్, సీతారాం, ప్రభు తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై అవగాహన


పెదపెంకిలో పారిశుద్ధ్యంపై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారిణి

బలిజిపేట: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించవచ్చని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారిణి క్రాంతి కిరణ్మయి అన్నారు. పెదపెంకిలో పారిశుద్ధ్యంపై ప్రజలకు గురువారం అవగాహన కల్పించారు. ఇళ్లలో సేకరించిన చెత్తను కాలువల్లో వేయకుండా ఇంట్లోనే తడి, పొడి చెత్తగా వేరుచేసి వీధుల్లోకి వచ్చే చెత్త బళ్ల వారికి అందజేయాలన్నారు. ఇళ్ల సమీపంలో నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సర్పంచ్ పాపారావు ఆధ్వర్యంలో గ్రామంలో వీధి కాలువల్లో పేరుకుపోయిన చెత్తను తొలగింపజేశారు. కార్యక్రమంలో సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిస కావొద్దు..



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఏఎస్ఐ

మక్కువ: విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిస కారాదని ఏఎస్ఐ ఎం.శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని వెంకట భైరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం జిల్లా పోలీస్ శాఖ ఆదేశాల మేరకు సంకల్పం అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ శ్రీనివాసరావు విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థి దశ నుండే కొందరు మత్తు పదార్థాలకు బానిసలై జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. మాదక ద్రవ్యాలకు అలవాటు పడిన వారితో స్నేహాలు చేయకూడదన్నారు.

విద్యుత్ చార్జీలు తగ్గించాలి

- వామపక్షాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న వామపక్ష నాయకులు

పార్వతీపురం టౌన్: టీడీపీ కూటమి ఎన్నికల వాగ్దానం ప్రకారం విద్యుత్ చార్జీలు తగ్గించాలని సీపీఐ న్యూ డెమోక్రసీ నాయకులు పి.రమణి డిమాండ్ చేసారు. స్థానిక ఎన్‌జీఓ హోంలో వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం ప్రజలపై విద్యుత్ భారాలను రద్దు చేస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చి ఇప్పుడు అదే విధానాలు అమలు చేయడం రాష్ట్ర ప్రజలను మోసం చేయడంగా ఉందన్నారు. రూ. 17వేల కోట్ల ట్రు అప్ చార్జీల భారాన్ని రద్దు చేయాలన్నారు. ఆ భారాన్ని ప్రభుత్వమే భరించాలని, ట్రు ఆప్ విధానాన్ని పూర్తిగా తొలగించాలని డిమాండ్ చేసారు. కేంద్రం తెచ్చిన విద్యుత్ సవరణ చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం వ్యతిరేకించాలని, ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కేంద్రంపై ఒత్తిడి చేయాలన్నారు. నివాసాలకు, వ్యవసాయ పంపు సెట్లకు స్మార్ట్ మీటర్లు బిగించే విధానాన్ని ఉపసంహరించుకోవాలని, పెట్టిన మీటర్లు తొలగించాలని, బలవంతంగా పెడితే అడ్డుకోవాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, వృత్తిదారులందరికీ 200 యూనిట్లు ఉచితంగా ఇవ్వాలని డిమాండ్ చేసారు. సమావేశంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి టి.జీవరత్నం, సీపీఎం పట్టణ కార్యదర్శి జి.వెంకటరమణ, గిరిజన సంక్షేమ సంఘం జిల్లా నాయకులు పి.రంజిత్‌కుమార్, అఖిల భారత గ్రామీణ వ్యవసాయ కార్మిక సంఘం (లిబరేషన్) నాయకులు పి.సంగం, అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకులు బి.నరసింగరావు తదితర సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి


శంబర గ్రామంలో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

మక్కువ: మండలంలోని శంబర పోలమాంబ అమ్మవారి చదురుగుడి, వనంగుడి సమీపంలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు అన్నారు. శంబర గ్రామంలో జరుపుతున్న అభివృద్ధి పనులను సీపీఎం నాయకులు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా కార్యదర్శి గంగునాయుడు మాట్లాడుతూ రూ.2.40 కోట్లతో శంబర పోలమాంబ ఆలయ ఆవరణలో నిర్మిస్తున్న సిమెంట్ రోడ్లు, కాలువలు, రిటర్నింగ్ వాల్ నిర్మాణాలపై అనేక అనుమానాలు ఉన్నాయన్నారు. చేపడుతున్న పనులపై ఇప్పటికే అనేక ఆరోపణలు వచ్చాయన్నారు. ప్రతిష్టాత్మకంగా శంబర పోలమాంబ అమ్మవారి ఆలయ ఆవరణ ప్రదేశాల్లో నిర్మిస్తున్న సిమెంట్ రోడ్లు, కాలువల పనుల్లో నాణ్యత లోపించిందని ఇసుక పాలు ఎక్కువ వేసి, సిమెంట్ పాలు తక్కువ వేస్తున్నారని ఆరోపించారు. ఉపాధి పథకం నిధులతో నిర్మిస్తున్న సిమెంట్ పనులు అంచనాల ప్రకారం చేయాలని డిమాండ్ చేశారు. అలాగే వనం గుడికి ఎదురుగా ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించకుండా రోడ్డు నిర్మాణం చేశారని, ఇంజినీరింగ్ అధికారులు అవగాహన రాహిత్యంతో ఉండడం సరైనది కాదన్నారు. రోడ్డు వేసిన తర్వాత విద్యుత్ స్తంభాలు తొలగిస్తే రోడ్డంతా పాడవుతుందని, దీనివలన ఉపయోగమేమి ఉండదన్నారు. జరుపుతున్న పనులపై మంత్రి సంధ్యారాణి ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సీపీఎం మండల నాయకులు అల్లు ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.